సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
శుక్రవారం । 4 । ఏప్రిల్ । 2025



టోల్ బాజా!

జాతీయ రహదారులపై ప్రయాణించే వాహనాల రుసుం వసూలు కోసం ఏర్పాటు చేసిన చేసిన టోల్‌ప్లాజాల వద్ద మరోసారి బాదుడు ప్రారంభమైంది.


8లో



వెంకన్న కల్యాణోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

వాడపల్లి వెంకటేశ్వరస్వామి వారి కల్యాణోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేసి, విజయవంతంగా నిర్వహించాలని కోనసీమ జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ ఆదేశించారు.

డెల్టాలకు నీరు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు గురువారం 10,300 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 3 వేలు, మధ్య డెల్టాకు 2 వేలు, పశ్చిమ డెల్టాకు 5,300 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.40 అడుగులు ఉంది.

న్యూస్‌రీల్

తీర్థయాత్రలకు ప్రత్యేక బస్సు



రామేశ్వరం - అరుణాచలం యాత్ర బస్సు

కొత్తపేట: ఏపీఎస్ ఆర్టీసీ రావులపాలెం డిపో నుంచి అరుణాచలం, రామేశ్వరం తీర్థయాత్రల ప్రత్యేక బస్ సర్వీసు ఈ నెల 19న బయలుదేరుతుందని ఆ డిపో మేనేజర్ జీజీవీ రమణ తెలిపారు. ఆమేరకు ఆయన కొత్తపేటలో ఒక ప్రకటన విడుదల చేశారు. అరుణాచలం, రామేశ్వరం తీర్థయాత్రల స్పెషల్‌గా 7 రోజులు, 14 పుణ్యక్షేత్రాలు దర్శించే విధంగా ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు ఏర్పాటు చేసినట్లు డీఎం తెలిపారు. శ్రీకాళహస్తి, అరుణాచలం, ఫళని, మధురై, కన్యాకుమారి, తిరుచందూర్, రామేశ్వరం, తంజావూర్, స్వామిమలై, కుంభకోణం, చిదంబరం, శ్రీరంగం, జంబుకేశ్వరం, కాంచీపురం క్షేత్రాల్లో దర్శనం చేయించి తిరిగి 26న బస్ రావులపాలెం చేరుతుందని పేర్కొన్నారు. టికెట్ చార్జీ ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం టిఫిన్‌తో కలిపి రూ.8,500 అని తెలిపారు. రూమ్ అద్దెలు యాత్రికులు భరించాలని పేర్కొన్నారు. రిజర్వేషన్ టికెట్లకు డిపో మేనేజర్ రావులపాలెం 9959225537, అసిస్టెంట్ మేనేజర్ 7382911871 నంబర్లకు ఫోన్ చేసి సంప్రదించాలని కోరారు.

ఉపాధి హామీలో కోనసీమ ఫస్ట్

అమలాపురం రూరల్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా జిల్లాలోని 22 మండలాల్లో 385 గ్రామ పంచాయతీల్లో 2024–25 ఆర్థిక సంవత్సరంలో 1.74 లక్షల ఉపాధి వేతన దారులకు పని కల్పించినట్టు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. 57 లక్షల పని దినాలు లక్ష్యం కాగా 56.80 లక్షల పనిదినాల కల్పన సాధించి రాష్ట్రంలో ప్రథమ స్థానం సాధించినట్టు తెలిపారు. రోజువారీ సగటు వేతనం రూ.291.20 చెల్లిస్తున్నట్టు చెప్పారు. 20 24–25 ఆర్థిక సంవత్సరంలో వేతనాల రూపంలో రూ.165.43 కోట్లు ఖర్చు చేశామన్నారు. జిల్లాలో సగటున ఒక్కో కుటుంబానికి 45.85 రోజుల పని కల్పన చేయగా షెడ్యూలు కుటుంబాలకు సగటున 47.82 రోజులు పని కల్పించారని తెలిపారు. జిల్లాలో 12,045 కుటుంబాలు 100 రోజులు పూర్తి చేయగా అందులో 6,013 షెడ్యూలు కుటుంబాలు వున్నాయని చెప్పారు.

ఆక్వా ఫీడ్ కెమికల్స్ దుకాణాలకు లైసెన్సులు తప్పనిసరి

అమలాపురం రూరల్: జిల్లాలోని ఆక్వా ఫీడ్ కెమికల్స్ విక్రయించు దుకాణదారులు తప్పనిసరిగా ఏపీ రాష్ట్ర ఆక్వాకల్చర్ అభివృద్ధి చట్టం కింద ఈ నెల 30వ తేదీ లోపు లైసెన్సులు పొంది ఉండాలని జిల్లా మత్స్యశాఖ అధికారి ఎల్‌బీఎస్ వర్ధన్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లేనిపక్షంలో మే నెల ఒకటో తేదీ నుంచి నిర్వహించే తనిఖీలలో లైసెన్సులు పొందని లేదా దరఖాస్తులు చేయని దుకాణదారులకు చట్ట ప్రకారం రూ.5 లక్షల జరిమానా విధిస్తామని తెలిపారు. ఆక్వా రంగంలో యాంటీ బయోటిక్స్ నిషేధంపై ఏర్పడిన జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో మార్చి 24వ తేదీన తీసుకున్న నిర్ణయాల మేరకు లైసెన్స్ తప్పనిసరి అని స్పష్టం చేశారు.

శ్రీరామ నవమి వేడుకలకు శ్రీకారం

అన్నవరం: రత్నగిరి క్షేత్ర పాలకుడు శ్రీ సీతారామచంద్ర స్వామి వారి శ్రీరామ నవమి వేడుకలకు శ్రీకారం చుట్టారు. రత్నగిరిపై రామాలయం వద్ద గురువారం ఉదయం పండితులు పందిరి రాట వేశారు. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ వీర్ల సుబ్బారావు, అసిస్టెంట్ కమిషనర్ రామ్మోహనరావు తదితరులు పందిరి రాటకు పూజలు చేశారు. కార్యక్రమంలో వేద పండితులు గొల్లపల్లి ఘనపాఠి, సత్యదేవుని ఆలయ ప్రధానార్చకుడు ఇంద్రగంటి నరసింహమూర్తి, రామాలయ అర్చకుడు దేవులపల్లి వరప్రసాద్, స్పెషల్ గ్రేడ్ వ్రత పురోహితుడు చామర్తి కన్నబాబు, పురోహితుడు పాలంకి పట్టాభి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి శ్రీరామ నవమి వేడుకలు

ఈ నెల ఐదో తేదీ నుంచి 13వ తేదీ వరకూ తొమ్మిది రోజుల పాటు శ్రీరామ నవమి వేడుకలు నిర్వహించనున్నారు. సీతారాముల కల్యాణ మహోత్సవాలకు సత్యదేవుడు, అమ్మవారు పెళ్లిపెద్దలుగా వ్యవహరించడం ఆనవాయితీ. ఈ నెల 5వ తేదీ సాయంత్రం 4 గంటలకు సీతాదేవి, శ్రీరామచంద్రమూర్తిని వధూవరులుగా అలంకరించడంతో వేడుకలు ప్రారంభమవుతాయి. ఆరో తేదీ ఉదయం 10 గంటల నుంచి సీతారాముల కల్యాణం నిర్వహిస్తారు. 7న ప్రత్యేక పూజలు, 8న పండిత సదస్యం, 9, 10 తేదీల్లో పూజలు, 11న సీతారాముల వనవిహారోత్సవం, 12న శ్రీచక్ర స్నానం నిర్వహిస్తారు. 13న శ్రీపుష్పయాగంతో కార్యక్రమాలు ముగుస్తాయి.

మద్దతు దక్కేనా?

- జిల్లాలో 404 ధాన్యం కొనుగోలు కేంద్రాలు
- 1.64 లక్షల ఎకరాల్లో రబీ వరి సాగు
- 6.17 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా
- రైతులకు ఇంకా ఖరీఫ్ కొనుగోలు రవాణా చార్జీల బకాయి
- నిబంధనల కొర్రీతో సగానికి పైగా ఏజెంట్లకే అమ్మకాలు



కోతలకు సిద్ధంగా ఉన్న రబీ వరిచేలు



ధాన్యం కొనుగోలు కేంద్రం (ఫైల్)

సాక్షి, అమలాపురం: గోదావరి డెల్టాలో రబీ వరి చేలు కోతలకు సిద్ధమవుతున్నాయి. మరో వారం పది రోజుల్లో వరి కోతలు మొదలు కానున్నాయి. నెలాఖరు నాటికి జోరుగా మాసూళ్లు జరగనున్నాయి. రైతుల పండించిన ప్రతి గింజా కొనుగోలు అయ్యేటట్టు చూస్తామని, జిల్లాలో పెద్ద ఎత్తున ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు రెవెన్యూ... పౌరసరఫరాల శాఖ అధికారులు చెబుతున్నారు. అయితే గత ఖరీఫ్ ధాన్యం కొనుగోలులో ఏర్పడిన గందరగోళాన్ని రబీలో రాకుండా చూడాలని రైతులతోపాటు మిల్లర్లు కూడా కోరుతుండడం గమనార్హం. జిల్లాలో రబీ సాగు ఆరంభం నుంచి నీటి ఎద్దడి.. తెగుళ్ల రైతులను ముప్పుతిప్పలు పెట్టాయి. కీలకమైన ఫిబ్రవరి, మార్చి నెలల్లో తీర ప్రాంత మండలాల్లోని శివారు, మెరకలకు నీరందక చేలు బీడు వారి దిగుబడి తగ్గే ప్రమాదం ఏర్పడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో పంట పండిన తరువాత ధాన్యం కొనుగోలు విషయంలోనైనా ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించడంతోపాటు కొనుగోలులో ఉదారంగా ఉంటే కనీస మద్దతు ధర అయినా దక్కుతుందని రైతులు ఆశిస్తున్నారు.

ఎకరాకు 49 బస్తాల దిగుబడి వస్తుందని అంచనా

కోనసీమ జిల్లా పరిధిలో తూర్పు డెల్టాలో ఆలమూరు, రామచంద్రపురం వ్యవసాయ సబ్ డివిజన్ల పరిధిలోను, మధ్య డెల్టా పరిధిలో కొత్తపేట, అమలాపురం, ముమ్మిడివరం, రాజోలు, పి.గన్నవరం వ్యవసాయ సబ్ డివిజన్ల పరిధిలో జిల్లాలో ఈ–పంట నమోదు ఆధారంగా చూస్తే రబీ సాగు 1,64,854 ఎకరాలలో జరిగింది. 6,17,000 మెట్రిక్ టన్నుల మేర ధాన్యం ఉత్పత్తి అయ్యే అవకాశముందని సివిల్ సప్లయిస్ అధికారులు అంచనా వేస్తున్నారు. సగటున ఎకరాకు 49 బస్తాలు (బస్తా 75 కేజీలు) చొప్పున దిగుబడి వస్తుందని చెబుతున్నారు. నీటి యాజమాన్యం ప్రణాళికా బద్ధంగా చేసి ఉంటే కనీసం 55 బస్తాలకు పైబడి దిగుబడి వచ్చేదని రైతులు చెబుతున్నారు.

404 ధాన్యం కొనుగోలు కేంద్రాలు

రబీ వరి కోతలు మొదలు కానున్న నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా 404 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. కొనుగోలు కేంద్రాలలో ధాన్యం కనీస మద్దతు ధర సాధారణ రకం క్వింటాల్ రూ. 2,300, గ్రేడ్ – ఏ రకానికి రూ.2,320 చొప్పున అందించనున్నారు. దీనిపై ఇప్పటికే కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి సమీక్ష జరిపి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. రబీ ధాన్యం సేకరణకు సంబంధించి బ్యాంక్ గ్యారంటీలు, రెన్యువల్, బఫర్ గోదాముల వినియోగం, తేమ తూనికల పరికరాలు, గోనె సంచులు, రవాణా లేబరు, టెక్నికల్ అసిస్టెంట్స్, వీఏఏ, జీపీఎస్ సమన్వయంతో వాహనాల మూమెంట్‌కు కస్టోడియన్ అధికారులు నియామకం. మిల్లర్ల ఎకనాలెడ్జ్‌మెంట్, జనరేషన్ ఎఫ్‌టీఓలను సిద్ధం చేయడంలో అధికారులు నిమగ్నమయ్యారు. రబీ ధాన్యం సేకరణకు జిల్లాస్థాయిలో జేసీ చైర్మన్‌గా, ఆర్డీవోలు, పౌర సరఫరాల డీఎం, డీఎస్‌వో, డీపీవో తదితర అధికారులు సభ్యులుగా కమిటీని ఏర్పాటు చేశారు.

ఖరీఫ్ కొనుగోలులోనూ గందరగోళం

- గత ఖరీఫ్ ధాన్యం కొనుగోలు విషయంలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. మిల్లుల వారీగా టార్గెట్‌లకు అనుగుణంగా కొనుగోలు చేశారు. టార్గెట్‌ల దాటిన తరువాత స్థానికంగా ఉన్న మిల్లులు కొనుగోలు చేయకపోవడంతో దూరంగా ఉన్న మిల్లులకు తోలుకోవాల్సి వచ్చింది. ఇలా ధాన్యం తరలించిన రైతులకు హమాలీ చార్జీలు ఇచ్చిన సివిల్ సప్లయిస్ అధికారులు రవాణా చార్జీలు మాత్రం రైతులకు ఇంకా ఇవ్వలేదు.
- రైతులకు ఎకనాలెడ్జ్‌మెంట్ ఇచ్చిన తరువాత నాలుగు గంటలలో మిల్లులకు పంపాలనే నిబంధన ఉంది. సకాలంలో లోడింగ్ అవ్వకున్నా.. దారిలో ట్రాక్టర్ ఆగి ఆలస్యం అయినా వారి ధాన్యం.. కొనుగోలు మిల్లుల వద్ద పెండింగ్ పెడుతున్నారు. రైతులకు వెయిటింగ్ చార్జీ రూపంలో అదనపు ఖర్చు అవుతోంది.
- 17 శాతం తేమ దాటితే కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం తీసుకోవడం లేదు. ధాన్యం ఏజెంట్లు, దళారులు మాత్రం 17 శాతం నుంచి 20 శాతం వరకు మూడు కేజీలు అదనంగా తీసుకుంటున్నారు (అంటే 75 కేజీల బస్తాకు 78 కేజీలు తీసుకుంటున్నారు) దీనివల్ల రైతులు నష్టపోయే పరిస్థితి నెలకొంది. 20 శాతం దాటితే మరింత రేటు తగ్గించి కొనుగోలు చేస్తున్నారు.
- ప్రస్తుత రబీలో యంత్రాలతో వరి కోతలు అధికంగా జరగనున్నాయి. వాతావరణం అనుకూలంగా ఉండడంతో 80 శాతం వరకు యంత్రాలతో కోతలు కోయనున్నారు. యంత్రాల కోత వల్ల ధాన్యంలో కనీసం 22 తేమ ఉంటోంది. దీనిని కళ్లాలో పరిచి, ధాన్యం ఎండబెట్టి తేమ శాతం 17 కన్నా తక్కువ తీసుకు రావాలంటే రైతులకు కనీసం రెండు రోజులు పడుతోంది. ఇందుకు అయ్యే కూలి ఖర్చులు, కళ్లాలకు తరలించడానికి అయ్యే ఖర్చులు పరిగణనలోకి తీసుకునే రైతులు యంత్రాలతో కోత అయిన వెంటనే అమ్మకాలు చేస్తుంటారు. ఇంత తేమ ఉన్న ధాన్యాన్ని దళారులు, ఏజెంట్లు కొనుగోలు చేయాల్సి ఉంది. ఆ సమయంలో వారు చెప్పిందే ధర అన్నట్టుగా ఉంది. దీనిని పరిగణలోకి తీసుకుని జిల్లా యంత్రాంగం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారానే ధాన్యం కొంటే రైతులకు మేలు జరుగుతుంది.

ప్రభుత్వం కొంటేనే రైతుకు మేలు



ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల **ద్వారానే రైతులు** ధాన్యం **కొనుగోలు చేయాలి.** అప్పుడే **రైతులకు కనీస మద్దతు** ధర **లభిస్తుంది. లేకుంటే** మిల్లర్లు, **ధాన్యం షావుకారులు** వారికి నచ్చిన ధరకు ధాన్యం **కొనే ప్రమాదముంది.** రైతులు పండించిన బొండం **రకంతోపాటు అన్నిరకాల** ధాన్యాలను ఎటువంటి కొర్రీ పెట్టకుండా కొనాలి.

– **జిన్నూరి వెంకటేశ్వరరావు**, వైఎస్సార్ సీపీ **రైతు విభాగం** జిల్లా అధ్యక్షుడు, నంగవరం, ఉప్పలగుప్తం మండలం

వక్ఫ్ బిల్లు ఆమోదం ముస్లింలను కించపరచడమే

– ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

అమలాపురం టౌన్: వక్ఫ్ బిల్లును ఆమోదించడం అంటే దేశంలోని ముస్లింలను కించపరచమేనని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఒక రకంగా చెప్పాలంటే బిల్లు ఆమోదం దేశ ద్రోహం లాంటిదని అభిప్రాయపడ్డారు. ఈ మేరకు ఎమ్మెల్సీ సూర్యనాయణరావు అమలాపురంలో గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. భారత రాజ్యాంగం ఆర్టికల్ 13, 14, 25, 26 ఉల్లంఘన ద్వారా వక్ఫ్‌బిల్లును ఆమోదించిన కేంద్రంలోని కూటమి పార్టీలకు, బీజేపీ ప్రభుత్వానికి ఇవే చివరి ఎన్నికలు అవుతాయని పేర్కొన్నారు. దేశంలోని ముస్లిం సోదరులకు మేమంతా అండగా ఉంటామని ఎమ్మెల్సీ స్పష్టం చేశారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ముస్లింలను పక్షపాతంగా చూడడం మానుకోవాలని ఆయన హితవు పలికారు. ముస్లింల బ్లాక్ లాని సుప్రీంకోర్టులో చాలెంజ్ చేసే అవకాశం ఉన్న దృష్ట్యా అందుకు తాము సహకరిస్తామని పేర్కొన్నారు. వక్ఫ్ బిల్లు ఆమోదానికి రాష్ట్రంలోని కూటిమి అనుబంధ పార్టీలైన టీడీపీ, జనసేనలు సై అనడం విచారకరమని ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు తెలిపారు. వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, పార్టీ నాయకులు కుడుపూడి త్రినాథ్, దండుమేను రూపేష్, ముంగర ప్రసాద్ వక్ఫ్ బిల్లు ఆమోదం సమంజసం కాదని అభిప్రాయపడ్డారు.

ముస్లింలపై కుట్రతోనే..

ముస్లింలపై కుట్రతోనే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వక్ఫ్ సవరణ బిల్లును ఆమోదించిందని వైఎస్సార్ పీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు, జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్ ప్రకటనలో ఆరోపించారు. ముస్లిం అభివృద్ధికి దానం చేసిన స్థిరచర ఆస్తులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర పన్ని తమ ఆధీనంలో ఉంచుకునేందుకే ఈ సవరణ బిల్లును తెర మీదకు తీసుకువచ్చాయని పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించారని ఖాదర్ గుర్తు చేశారు. ముస్లిం సమాజానికి హాని తలపెట్టే ఎలాంటి చట్టాన్నైనా అంగీకరించబోనని అసెంబ్లీలో తీర్మానించి పంపించిన ధీరుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని స్పష్టం చేశారు. జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ డైరెక్టర్లు ఎండీవై షరీఫ్, అలీషా, కర్రార్ హుస్సేన్, బిల్లు ఆమోదించడాన్ని ఖండించారు.

ఇదేం ‘ఆనంద’ం?

- వెంకన్న కల్యాణోత్సవాల వాల్‌పోస్టర్లకు రూ.వేలల్లో వృథా
- తొలుత అవగాహన లేమితో ముద్రణ
- తర్వాత తప్పిదం గ్రహించి కొత్తగా ప్రింటింగ్



తొలుత ఎమ్మెల్యే ఆనందరావు ఫొటోతో ముద్రించిన వాల్‌పోస్టర్

అమలాపురం టౌన్: అమలాపురం వేంకటేశ్వరస్వామి కళ్యాణోత్సవాలకు అటు అధికారులు, ఇటు ఉత్సవ కమిటీ ప్రతినిధుల అవగాహన లోపం, నిర్లక్ష్యంతో వాల్ పోస్టర్లు ముద్రించడం విమర్శలకు దారి తీసి వివాదాస్పదమైంది. కల్యాణోత్సవాలకు కేవలం ఒక్క అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఫొటో పెట్టి వాల్ పోస్టర్ల వెయ్యికి పైగా ముద్రించారు. దీనికి దేవస్థానం సొమ్ము రూ.వేలల్లో వెచ్చించారు. అయితే వాల్ పోస్టర్లపై అమలాపురం ఎంపీ గంటిహరీష్ మాథూర్ ఫొటో ముద్రించకపోవడంతో ఎంపీ అనుచరులు, అభిమానులు అభ్యంతరం చెప్పారు. తొలుత దేవస్థానం ఈవో యర్రా వెంకటేశ్వరారావుతో పాటు ఉత్సవ కమిటీ ప్రతినిధుల అవగాహన లోపం, నిర్లక్ష్యంతో ఇదంతా జరిగిందని ఎంపీ తరఫున టీడీపీ నాయకులు ధ్వజమెత్తారు. దేవస్థానం అధికారులు, ఉత్సవ కమిటీపై ఒత్తిడి పెరగడంతో వాల్ పోస్టర్ల విషయంలో దిద్దుబాటు చర్యలు చేపట్టారు. ఎట్టకేలకు ఎమ్మెల్యే ఫొటోతో ముద్రించిన వాల్ పోస్టర్లను పక్కన పెట్టి ఎమ్మెల్యేతో పాటు ఎంపీ హరీష్ ఫొటోతో మరో వెయ్యికి పైగా పోస్టర్లను తాజాగా ముద్రించి పంపిణీ చేస్తున్నారు. వాల్ పోస్టర్లపై ఎంపీ ఫొటో ఉండాలనేది ప్రొటోకాల్ కాదని వాదించిన ఆలయ అధికారులు తర్వాత కిమ్మనకుండా కొత్తవి ముద్రించడం గమనార్హం. ఎమ్మెల్యే ఫొటోతో ముద్రించిన పోస్టర్లకు అయిన వ్యయం వృథా అయిందని భక్తులు అంటున్నారు.

కోకో హబ్‌గా జిల్లా

కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం రూరల్: కోనసీమ ప్రాంతంలో కొబ్బరి తోటల్లో అంతర పంటగా కోకో సాగుకు ఎంతో అనువైన వాతావరణం ఉందని, ఆ దిశగా కోకో సాగు విస్తీర్ణాన్ని దశల వారీగా పెంచుతూ కోకో హబ్‌గా జిల్లాను తీర్చిదిద్దాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఉద్యాన అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి కోకో కమిటీ ఆధ్వర్యంలో ఉద్యాన విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు, కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. కోకో కాయల కోత అనంతరం ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపనకు చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ కోనసీమ జిల్లాలో ఏక పంటగా కొబ్బరి విరాజిల్లేదని, ఫీడ్ నల్లి తాకిడితో కొబ్బరి దిగుబడి తగ్గిపోయి కేవలం కొబ్బరిపై ఆధారపడి రైతు మనుగడ సాగించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇలాంటి తరుణంలో రైతును అన్ని విధాలుగా ఆదుకున్నది కోకో పంటని అన్నారు. కొబ్బరిలో అంతర పంటగా సాగు చేయడానికి అనుకూల వాతావరణం ఉందని చెప్పారు. నాటిన మూడో ఏడాది నుంచి దిగుబడి వస్తుందని అన్నారు. కాయల నుంచి తీసిన గింజలను నాణ్యతతో ప్రాసెస్ చేయడంలో రైతులకు అవగాహన లేక గిట్టుబాటు ధరలు పొందలేకపోతున్నారన్నారు. ఈ నేపథ్యంలో వెయ్యి ఎకరాలకు ఒక కామన్ ఫర్మింటేషన్ కేంద్రాన్ని ఒక ఎకరం స్థలంలో నెలకొల్పే దిశగా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం 2,500 ఎకరాలలో కోకో పంట ఉందని దీనిని దశలవారీగా ఏడాదికి వెయ్యి ఎకరాలు చొప్పున విస్తీర్ణాన్ని పెంచేందుకు కార్యాచరణ అమలు కాబోతోందన్నారు. ఉద్యాన విశ్వవిద్యాలయ ప్రిన్సిపల్ శాస్త్రవేత్త డాక్టర్ తిరుపతి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ మాధవీలత, శాస్త్రవేత్త నవీన్ కుమార్ జిల్లా ఉద్యాన అధికారి బీవీ రమణ, రమ్య ఫుడ్స్ ప్రతినిధులు శ్రీనివాసరెడ్డి, వీరారెడ్డి, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ పీకేపీ ప్రసాద్, ఉద్యాన అధికారులు దిలీప్, చందన పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

తహసీల్దార్లకు నైపుణ్య పరీక్షలు

జిల్లాలోని తహసీల్దార్లు ఆన్‌లైన్ సేవలను స్వయంగా నిర్వహించగలుగుతున్నారా లేదా అన్న విషయాన్ని అంచనా వేసేందుకు నైపుణ్య పరీక్షలు నిర్వహించినట్లు కలెక్టర్ మహేష్‌కుమార్ తెలిపారు. జిల్లాలోని తహసీల్దార్లకు మూడు రెవెన్యూ డివిజన్ కార్యాలయాల్లో జాయింట్ కలెక్టర్, సంబంధిత రెవెన్యూ డివిజనల్ అధికారుల ఆధ్వర్యంలో గురువారం నైపుణ్య పరీక్షలు షిఫ్టుల వారీగా చేపట్టామన్నారు.

ఆక్వా జోన్ మాకొద్దు

- మూడు పంటలు పండే భూములను పాడు చేయలేం
- బడాబాబుల బాగుకోసం మమ్మల్ని బలిపెట్టుకోలేం
- అంగర గ్రామ సభలో రైతుల స్పష్టీకరణ



గ్రామసభలో మాట్లాడుతున్న ఎఫ్‌డీఓ

కపిలేశ్వరపురం: మండలంలోని గ్రామాలను ఆక్వా జోన్‌గా ప్రభుత్వ అధికారులు ప్రతిపాదించడాన్ని అంగర గ్రామస్తులు ముక్త కంఠంతో వ్యతిరేకించారు. ఆక్వా జోన్ ప్రాధాన్యం, సాగు ఫలితాలు తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించే ఉద్దేశంతో గురువారం అంగర పంచాయతీ కార్యాలయం వద్ద ఫిషరీస్ డెవలప్‌మెంట్ అధికారి వి. డేవిడ్‌రాజు గ్రామసభను నిర్వహించారు. రెవెన్యూ శాఖ సహకారంతో మత్స్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభలో రాజకీయాలకు అతీతంగా రైతులు ఒక్కమాటపై నిలిచారు. తొలుత ఎఫ్‌డీఓ డేవిడ్‌రాజు మాట్లాడుతూ మండలంలోని గ్రామాలను సర్వే చేసి ఆక్వా సాగుకు అనుకూలమని తేల్చామన్నారు. వరి సాగు రైతులు ముందుకొస్తే ఆక్వా సాగులోకి మళ్లే విషయాలపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తామన్నారు. గ్రామంలో 252 ఎకరాల రైతులు 332 మందిని ఆక్వాజోన్‌లో చేర్చాలన్నది అధికారుల ప్రతిపాదనగా ఉందన్నారు. దీనిపై రైతులు మాట్లాడుతూ ఆక్వాజోన్ ప్రతిపాదన రైతులు, ప్రజలు నుంచి వచ్చిందా? చెరువులు తవ్వి లాభాలు గడించాలనుకొనే పెద్దల నుంచి వచ్చిందా అని ప్రశ్నించారు. సర్వే ఆధారంగా ఉన్నతాధికారులు ప్రతిపాదించారని ఎఫ్‌డీఓ సమాధానం చెప్పారు. ఆక్వాజోన్‌లో ఉండటం వల్ల చెరువులు తవ్వుకునేందుకు అనుమతులు సులభంగా లభిస్తాయని, ఆక్వా సాగుకోసం ప్రభుత్వం రాయితీలు, ఇతర ప్రోత్సాహకాలు లభిస్తాయని చెప్పారు. వరి సాగు నుంచి ఆక్వా సాగుకు మారినందువల్ల వరి రైతులకు ఎలాంటి ప్రయోజనాలను ప్రభుత్వం కల్పించదని స్పష్టం చేశారు. దానిపై రైతులు మాట్లాడుతూ మూడు పంటలు పండే సారం కలిగిన తమ భూములను ఆక్వా సాగు పేరుతో పాడు చేయలేమన్నారు. నాలుగైదు కుంచాలు భూములు కలిగిన రైతులు చెరువులను తవ్వడం సాధ్యం కాదన్నది సుస్పష్టమన్నారు. చెరువులు తవ్వే శక్తి సామర్థ్యాలు గల బడాబాబులకు మాత్రమే ఆక్వా జోన్ వల్ల ప్రయోజనాలు ఒనగూరుతాయన్నారు. ఆక్వా జోన్ పేరుతో తమ బతుకులను బలిపెట్టుకోలేమంటూ అధికారులకు స్పష్టం చేశారు. ఆక్వా జోన్ ఏర్పాటును తిరస్కరిస్తూ తీర్మానం చేశారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని మత్స్యశాఖాధికారులు రైతులతో చెప్పారు. వీఆర్వో మహాలక్ష్మి, మత్స్యశాఖ గ్రామ సహాయకురాలు షెలీనా, రైతులు పాల్గొన్నారు.

13న ఉగాది జాతీయ కవి సమ్మేళనం

అమలాపురం టౌన్: శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఈ నెల 13వ తేదీన అమలాపురంలో 147వ జాతీయ కవి సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ వేదిక అంతర్జాతీయ సీఈవో డాక్టర్ కత్తిమండ ప్రతాప్ వెల్లడించారు. స్థానిక కూచిమంచి అగ్రహారంలోని సాయి సంజీవిని ఆస్పత్రి ఆడిటోరియంలో గురువారం జరిగిన జిల్లా శ్రీశ్రీ కళా వేదిక ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా వేదిక ప్రతినిధులతో పాటు పలువురు కవులు, సాహితీవేత్తలు, రచయితలు, కళాకారులు పాల్గొని శ్రీ కళా గ్రాండ్ రెసిడెన్సీలో నిర్వహించే జాతీయ కవి సమ్మేళనం నిర్వహణపై చర్చించారు. సమావేశంలో ఉగాది జాతీయ కవి సమ్మేళనం బ్రోచర్లను వేదిక ప్రతనిధులు విడుదల చేశారు. శ్రీశ్రీ కళా వేదిక జిల్లా కన్వీనర్లు నల్లా నరసింహమూర్తి, బీవీవీ సత్యనారాయణ, జాతీయ కమిటీ కార్యదర్శి మాకే బాలార్జున సత్యనారాయణ, కడలి సత్యనారాయణ పాల్గొన్నారు.



బ్రోచర్లను విడుదల చేస్తున్న శ్రీశ్రీ కళా వేదిక సీఈవో డాక్టర్ ప్రతాప్ తదితరులు

చంద్రబాబు కరడుగట్టిన కులతత్వ వాది



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌పీఐ అధ్యక్షుడు డీబీ లోక్

అమలాపురం టౌన్: ముఖ్యమంత్రి చంద్రబాబు కరడు గట్టిన కుల తత్వవాదని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్‌పీఐ) రాష్ట్ర అధ్యక్షుడు డీబీ లోక్ ఆరోపించారు. ముఖ్యంగా ఎస్సీలు, బీసీలు అంటే ఆయనకు చిన్న చూపు ఉందని ధ్వజమెత్తారు. స్థానిక అరిగెలవారిపాలెంలో గురువారం సాయంత్రం జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో లోక్ మాట్లాడారు. చంద్రబాబు గత చరిత్రను పరిశీలిస్తే ఎస్సీలను, బీసీల్లోని నాయీ బ్రాహ్మణులు తదితర కులాలను అవహేళన చేసి మాట్లాడిన సందర్భాలు ఉన్నాయని ఆయన గుర్తు చేశారు. ఇలా కులాలను అవమానిస్తున్న చంద్రబాబుకు ఇవే ఆఖరి ఎన్నికలని స్పష్టం చేశారు. ఈసారి ఎస్సీలు, బీసీలు చంద్రబాబును చిత్తుగా ఓడించడం ఖాయమన్నారు. ఓడిన తర్వాత తన ఆస్తులను కాపాడుకోవడంలోనే చంద్రబాబుకు భయం పుడుతుందని జోస్యం చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ఆయనపై ప్రజలు నిశ్శబ్ద ఉద్యమం చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నారని లోక్ హెచ్చరించారు.


కాలేజీ విద్యార్థుల మోటార్ బైక్‌లు 20 సీజ్



భట్లపాలెంలో విద్యార్థుల వాహనాల తనిఖీ చేస్తున్న రవాణాశాఖ అధికారులు

అమలాపురం రూరల్: మండలంలోని భట్లపాలెంలో బీవీసీ ఇంజినీరింగ్ కాలేజీ వద్ద రవాణాశాఖ అధికారులు గురువారం జరిపిన తనిఖీలలో డ్రైవింగ్ లైసెన్స్‌లు లేకుండా, హెల్మెట్ ధరించకుండా, ట్రిపుల్ డ్రైవింగ్, సెల్ ఫోన్ డ్రైవింగ్ చేస్తున్న విద్యార్థుల 20 మోటార్ బైక్‌లను సీజ్ చేశారు. ఈ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని బైక్ మీద కాలేజీకి వచ్చే ప్రతి విద్యార్థి విధిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు సూచించారు. రహదారి భద్రత విషయంలో ఉపేక్షించేది లేదని, అవసరమైతే తల్లితండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తామని తెలిపారు. ఈ విషయంలో కాలేజీ ప్రిన్సిపాల్, అధ్యాపకులు ముఖ్య బాధ్యత తీసుకోవాలని కోరారు. వాహనాలు సీజ్ చేసిన కాలేజీ విద్యార్థులకు రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. తనిఖీల్లో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు జ్యోతి, సురేష్, కాశీ విశ్వేశ్వరరావు, కౌశిక్ పాల్గొన్నారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	15,500
గటగట (వెయ్యి)	14,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	14,500
గటగట (వెయ్యి)	13,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,000 – 13,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	13,000 – 13,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

అనుమతుల్లేని క్వారీలో యంత్రాల సీజ్



అనుమతి లేకుండా తవ్వుతున్న యంత్రాలను సీజ్ చేసిన అధికారులు

రౌతులపూడి: మండలంలోని ములగపూడిలో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న నల్లరాయి క్వారీల్లో మైనింగ్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలో సర్వే నంబరు-1లో ప్రభుత్వ అనుమతులు పొందకుండా నిర్వహిస్తున్న నల్లరాయిని అధికారులు గుర్తించారు. ఈ క్వారీలో పనిచేస్తున్న ఒక కంప్రెసర్, డ్రిల్లింగ్ మెషీన్, 323 పొక్లెయిన్‌ను సీజ్‌చేసి స్వాధీనం చేసుకున్నట్లు మైనింగ్ ఆర్ఐ మురళీకృష్ణ తెలిపారు. స్వాధీనం చేసుకున్న యంత్రాలను స్థానిక రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేశామని చెఆప్పరు. ఆర్ఐ పట్నాయక్, వీఆర్ఓ శ్రీను, మైనింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

టోల్ బాజా!

- పెరిగిన రుసుం చెల్లింపులు
- మార్చి 31 అర్ధరాత్రి నుంచి అమల్లోకి
- నెలవారీ పాస్‌లనూ వదలని ఎన్‌హెచ్ఏఐ
- వాహనదారులపై రోజుకు రూ.2.5 లక్షల భారం

ఆలమూరు: జాతీయ రహదారులపై ప్రయాణించే వాహనాల రుసుం వసూలు కోసం ఏర్పాటు చేసిన చేసిన టోల్‌ప్లాజాల వద్ద మరోసారి బాదుడు ప్రారంభమైంది. టోల్‌గేట్ రహితంగా భారతదేశాన్ని తీర్చిదిద్దుతామన్న కేంద్ర ప్రభుత్వ హామీ నెరవేరక పోగా వాహనదారులపై ఏటా పెను భారం మోపనుంది. గత ఏడాది జూన్ ఒకటిన టోల్ ధరలను పెంచగా ఏడాది గడవకుండానే మళ్లీ ఈ ఏడాది మార్చి 31 అర్ధరాత్రి నుంచి పెంచేశారు. అన్ని రకాల వాహనదారులకు రుసుముల మోత మోగిస్తూ నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ) నిర్ణయం తీసుకుంది. జాతీయ రహదారుల్లో ఇష్టానుసారం టోల్‌ప్లాజాలను ఏర్పాటు చేసి రుసుములను పెంచడంతో వాహనదారులు తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. టోల్‌ప్లాజా సిబ్బందితో వాహనదారులు ఘర్షణ పడటం నిత్యకృత్యమై పోయింది. వాహనదారుల నుంచి భారీ స్థాయిలో రుసుములు వసూలు చేస్తున్న టోల్‌ప్లాజా నిర్వాహకులు వాటికి తగ్గట్టుగా సౌకర్యాలు కల్పించకపోవడంపై తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని 216, 216ఏ జాతీయ రహదారులు ఉన్నాయి. కాకినాడ జిల్లాలోని కత్తిపూడి నుంచి కృష్ణా జిల్లాలోని పామర్రు వరకూ 216 జాతీయ రహదారి ఉండగా ఏలూరు జిల్లాలోని గుండుగొలను నుంచి వయా పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం, తణుకు, కోనసీమ జిల్లాలోని రావులపాలెం మీదుగా తూర్పు గోదావరి జిల్లా దివాన్ చెరువు వరకూ 216ఏ జాతీయ రహదారి విస్తరించింది.

జిల్లాలో రెండు టోల్‌ప్లాజాల ఏర్పాటు

కోనసీమ జిల్లాలోని 216 జాతీయ రహదారిలోని ముమ్మిడివరం మండలంలోని అన్నంపల్లి వద్ద, 216 ఏ జాతీయ రహదారిలోని రావులపాలెం మండలం ఈతకోట వద్ద ఎన్‌హెచ్ఏఐ రెండు టోల్‌గేట్లను ఏర్పాటు చేసింది. ఈ రెండు టోల్‌గేట్ల నుంచి ప్రతి రోజు సుమారు 12 వేల వరకూ వాహనాలు రాకపోకలు సాగిస్తుండగా దాదాపు రూ.32 లక్షల వరకూ టోల్ రుసుం ద్వారా ఆదాయం లభిస్తుంది. ఈతకోటలో ఏర్పాటు చేసిన టోల్ గేట్ ద్వారా ప్రతి రోజు సుమారు 6,500 వాహనాలు, అన్నంపల్లిలో ఏర్పాటు చేసిన టోల్‌గేట్ మీదుగా రోజూ దాదాపుగా 5,500 వాహనాల వరకు రాకపోకలు సాగిస్తున్నాయి. ప్రయాణించే వాహనాల యాక్సిల్‌ను బట్టి కిలోమీటరుకు ఐదు పైసల నుంచి 34 పైసల వరకూ పెంపు జరిగింది. అలాగే ఈతకోట వద్ద కారు, జీపులకు కనీసం రుసుం రూ.ఐదు నుంచి గరిష్టంగా రూ.40 వరకూ పెరగ్గా అన్నంపల్లి వద్ద రూ.ఐదు నుంచి రూ.20 వరకూ పెరిగింది. ఈ ఆర్థిక సంవత్సరంలో టోల్ రుసుం పెంపు ద్వారా రోజుకు మరో రూ 2.5 లక్షల మేర వాహనదారులు అదనంగా చెల్లించవలసిన పరిస్థితి ఏర్పడింది. వాహనాలకు ఫాస్ట్ ట్యాగ్ లేకపోతే నగదు రూపంలో రెట్టింపు రుసుం వసూలు చేయడం విమర్శలకు తావిస్తోంది. టోల్‌ప్లాజా పరిసరాల్లో నివసిస్తున్న స్థానికుల వాహనాలకు మంజూరు చేసే పాస్ రుసుము రూ.340 నుంచి రూ.350కు పెంచారు.

టోల్‌ప్లాజాల వద్ద సౌకర్యాలు అంతంతే

ఎన్‌హెచ్ఏఐ నిబంధనల ప్రకారం టోల్‌ప్లాజాల వద్ద అనేక సౌకర్యాల కల్పన జరగవలసి ఉంది. వాహన చోదకులు విశ్రాంతి గదులు, తాగునీరు, పురుషులకు, మహిళలకు వేర్వేరుగా మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలి. వాహనదారులకు ఏవిధమైన సమస్య వచ్చినా సత్వరమే అత్యవసర సేవలు అందించేందుకు ప్రత్యేక యంత్రాంగం అందుబాటులో ఉండాలి. ఫాస్ట్ ట్యాగ్ ఉన్న వాహనాలను కేవలం పది సెకన్ల లోపే దాటించాలి. ఏమాత్రం సమయం దాటినాఆ వాహనానికి టోల్‌రుసుం వసూలు చేయకూడదనే నిబంధన ఉన్నా ఎక్కడా అమలు కావడం లేదని వాహనదారులు చెబుతున్నారు.



ఈతకోట టోల్‌ప్లాజా



ఈతకోట టోల్‌ప్లాజా వద్ద పాత రుసుం



ఈతకోట టోల్‌ప్లాజా వద్ద కొత్త రుసుం

టోల్ రుసుము పెంపు ఇలా.. (ప్రతి కి.మీ.)

వాహనం పేరు	పాత రుసుం (రూ.ల్లో)	కొత్త రుసుం (రూ.ల్లో)	పెంపు (పైసలు)
కారు/జీపు (సింగిల్ యాక్సిల్)	1.46	1.51	05
బస్సు/లారీ (డబుల్ యాక్సిల్)	4.96	5.14	18
బస్సు/లారీ (ట్రిబుల్ యాక్సిల్)	5.41	5.60	19
భారీ వాహనాలు	7.78	8.06	26
అతి భారీ వాహనాలు	9.47	9.81	34

టోల్ ఎగ్గొట్టేందుకు అడ్డదారులు



కృష్ణవరంలో ఇసుక లారీలను అడ్డుకున్న గ్రామస్తులు

కిర్లంపూడి: టోల్ ఫీజులు ఎగ్గొట్టేందుకు అడ్డదారుల్లో గ్రామాల మధ్యలోంచి వెళ్లేందుకు భారీ వాహనాల డ్రైవర్లు వెనుకాడడంలేదు. మండల పరిధి కృష్ణవరంలోని టోల్‌గేట్ వద్ద ఫీజు ఎగ్గొట్టేందుకు బూరుగుపూడి ఊరు శివారున పోలవరం కాలువ గట్టు మీదుగా కృష్ణవరం ఊరు మధ్యలో నుంచి సుమారు 60–65 టన్నుల ఇసుక లోడుతో నిత్యం వందల సంఖ్యలో భారీ వాహనాలు వెళుతున్నాయి. దీంతో కృష్ణవరంలోని గ్రామస్తులు గురువారం లారీలను అడ్డుకున్నారు. భారీ ఇసుక లారీలు గ్రామం మధ్యలో నుంచి వేగంగా వెళ్లడంతో ఏ సమయాన ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదే మార్గంలో ఎంపీపీ ప్రభుత్వ పాఠశాల ఉండడంతో విద్యార్థులకు ఏ ముప్పు వాటిల్లుతుందోనని పలువురు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు సామర్థ్యాన్ని మించి ఇసుక లోడులు వెళ్లడం వల్ల సీసీ రోడ్డు పాడైపోతుందన్నారు. దీంతో పాటు ఇళ్లల్లోకి దుమ్ముధూళీ రావడంతో పాటు ఇళ్ల గోడలు బీటలు వారుతున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామాల్లోంచి లారీల రవాణాను ఆపకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

వ్యక్తి ఆత్మహత్య



రొక్కాల మోజేష్ (ఫైల్)

అంబాజీపేట: భార్యాభర్తల మధ్య ఏర్పడిన మనస్పర్థల కారణంగా గురువారం తెల్లవారుజామున ఓ వ్యక్తి తన ఇంటిలోనే ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతి చెందాడు. దీనికి సంబంధించి ఎస్సై కె.చిరంజీవి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అంబాజీపేట లీజర్ కాలనీకి చెందిన రొక్కాల మోజేష్ (34) తన భార్యతో మనస్పర్థలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో అతని భార్య వారం రోజుల క్రితం తన పుట్టింటికి అల్లవరం మండలం తుమ్మలపల్లి వెళ్లి పోయింది. దీంతో అతను మనస్థాపానికి గురయ్యాడు. తన ఏడాదిన్నర కుమార్తెకు ఐ మిస్‌యూ బంగారు తల్లి అని స్టేటస్ పెట్టుకున్నాడు. అనంతరం తన బెడ్‌రూమ్‌లో ఉన్న ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతి చెందాడు. మోజెష్ ఇంకా నిద్ర లేవ లేదా అంటూ స్థానికులు కిటికిలోంచి చూసే సరికి విగత జీవిగా ఉన్నాడు. దాంతో మృతుడి ఇంటి తలుపులు పగులకొట్టి చూసేసరికి మృతి చెంది ఉన్నాడు. ఘటనా స్థలాన్ని ఎస్సై కె.చిరంజీవి పరిశీలించి వివరాలు సేకరించారు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు.

చికిత్స పొందుతూ ఎంపీటీసీ సభ్యురాలి భర్త మృతి



బొడ్డేటి గోవింద్

ఏలేశ్వరం: గత నెల 20న మండల పరిధిలోని తిరుమాలిలో జరిగిన రోడ్డుప్రమాదంలో గెద్దనాపల్లి ఎంపీటీసీ సభ్యురాలు బొడ్డేటి నాగలక్ష్మి భర్త గోవిందు(39) గురువారం చికిత్స పొందుతూ మృతిచెందారు. పోలీసుల వివరాల ప్రకారం కిర్లంపూడి మండలం గెద్దనాపల్లికి చెందిన గోవింద్ బెల్లం వ్యాపారం కోసం గత నెల 20న మోటారుబైక్‌పై ఏలేశ్వరం వస్తుండగా మార్గమధ్యలో తిరుమాలి వద్ద ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించారు.

16 కేజీల గంజాయి స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితుడితో ధవళేశ్వరం సీఐ గణేష్, సిబ్బంది

ధవళేశ్వరం: విశాఖపట్నం ఏజెన్సీ ప్రాంతం నుంచి హర్యానాకు తరలిస్తున్న 16 కేజీల గంజాయిని ధవళేశ్వరం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఘటనకు సంబంధించి ధవళేశ్వరం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హర్యానా రాష్ట్రం ఫరీదాబాద్ జిల్లాకు చెందిన రాకేష్ నరావత్ ఏజెన్సీ నుంచి 16 కేజీల గంజాయిని సంచిలో వేసుకొని తీసుకువెళుతున్నాడు. గంజాయి రవాణాపై ప్రత్యేక దృష్టి సారించిన పోలీసులు గురువారం ఉదయం వాహనాలు తనిఖీ చేస్తుండగా రాకేష్ నరావత్ వద్ద ఉన్న 16 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకొని అతడిని అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారు. గంజాయిని స్వాధీనం చేసుకున్న ధవళేశ్వరం సీఐ టి.గణేష్, సిబ్బందని ఎస్పీ డి.నరసింహకిషోర్, డీఎస్పీ భవ్యకిషోర్ అభినందించారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్



నిందితుడితో పాటుగా, దొంగిలించిన ఆభరణాలను చూపిస్తున్న ఎస్సై సురేష్

రాయవరం: ఇటీవల రాయవరం ఆలయంలో పట్టపగలు జరిగిన చోరీ ఘటనలో నిందితుడిని పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. వివరాలను రాయవరం ఎస్సై డి.సురేష్‌బాబు విలేకరుల సమావేశంలో వెల్లడించారు. రాయవరం అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారి మెడలో మంగళసూత్రాలు చోరీ చేసిన నిందితుడు తోరాటి సాయివరప్రసాద్‌ను అరెస్ట్ చేశామన్నారు. రంగంపేట మండలం నల్లమిల్లికి చెందిన సాయివరప్రసాద్ మహేంద్రవాడ్ రోడ్డులో పాత హెచ్‌పీ గొడౌన్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండగా, నిందితుడిని అదుపులోకి తీసుకున్నామన్నారు. నిందితుడు సాయివరప్రసాద్‌ను విచారించగా, నేరం అంగీకరించాడన్నారు. నిందితుడి వద్ద నుంచి బంగారు మంగళసూత్రంతో పాటుగా, బిక్కవోలు మండలం పందలపాక గ్రామంలో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో చోరీ చేసిన వెండి కిరీటం, వెండి చెవులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సురేష్‌బాబు తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసి అనపర్తి జేఎఫ్‌సీఎం కోర్టులో హాజరు పర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించారన్నారు. నేరం జరిగిన 48 గంటల్లో కేసును ఛేదించి, నిందితుడిని అరెస్ట్ చేసిన సీఐ దొరరాజు, ఎస్సై సురేష్‌బాబు, పీసీ జీవీ కుమార్‌ను జిల్లా ఎస్పీ అభినందించారు.

వెంకన్న కల్యాణోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు



వాడపల్లిలో కల్యాణోత్సవాలపై సమీక్షిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

కొత్తపేట: వాడపల్లి వేంకటేశ్వరస్వామి వారి కల్యాణోత్సవాలకు తరలివచ్చే భక్తుల సంఖ్యకు అనుగుణంగా ఏర్పాట్లు చేసి, ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించాలని కోనసీమ జిల్లా కలెక్టర్ రావిరాల మహేష్ కుమార్ దేవదాయ శాఖ అధికారులతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులకు సూచించారు. ఈ నెల 7 నుంచి 13 వరకు కళ్యాణోత్సవాలు జరగనున్న నేపథ్యంలో ఏర్పాట్లపై గురువారం ఆలయ ఆవరణలో ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. దేవదాయ – ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కలెక్టర్ మహేష్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఏడు రోజుల పాటు జరిగే అన్ని కార్యక్రమాలు ప్రధానంగా 8వ తేదీన జరిగే రథోత్సవం, రాత్రి జరిగే కల్యాణోత్సవం తిలకించడానికి లక్షల సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున అందుకు తగిన ఏర్పాట్లు చేయాల్సిందిగా అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూ ఆలయం అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపొందించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉన్నత శాఖల అధికారులతో చర్చించి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఎస్పీ కృష్ణారావు మాట్లాడుతూ బందోబస్తుకు అవసరమైన సిబ్బంది జాబితా సిద్ధం చేయాలని సబ్ డివిజన్ అధికారులకు సూచించారు. జాయింట్ కలెక్టర్ నిషాంతి, ఆర్డీఓ పి.శ్రీకర్, డీఎస్పీ సుంకర మురళీ మోహన్ మాట్లాడుతూ తమ పరిధిలో తీసుకునే ఏర్పాట్లను, ముందస్తు చర్యలను వివరించారు. తహసీల్దార్ టి.రాజరాజేశ్వరరావు, ఎంపీడీవో బీకేఎస్ ఎస్వీ రామన్, రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్, ఎస్సై ఎస్.రాము, ఆర్ అండ్ బీ శాఖ డీఈఈ రాజేంద్ర, ఏఈ మణికుమార్, ఎలక్ట్రికల్ ఇంజనీర్ అశోక్, వాడపల్లి ఉప సర్పంచ్ పోచిరాజు బాబురావు, లొల్ల సర్పంచ్ కాయల జగన్నాథం, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

5, 6 తేదీల్లో రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీలు




విలేకరులతో మాట్లాడుతున్న తీగల రాజా, వెంకట్

రాజమహేంద్రవరం సిటీ: ఆంధ్రప్రదేశ్ అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ సహకారంతో రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్ ఆధ్వర్యంలో ఈ నెల 5,6 తేదీల్లో రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలు నిర్వహిస్తున్నట్లు రాజమహేంద్రవరం చార్టర్ అధ్యక్షుడు తీగెల రాజా, ఐకాన్స్ క్లబ్ అధ్యక్షుడు ఇమ్మణి వెంకట్ చెప్పారు. గురువారం రాజమహేంద్రవరం క్లబ్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ఉత్తరాదిలో ఎంతో ప్రసిద్ధి చెందిన ఈ కుస్తీ పోటీలను తమ క్లబ్ తరఫున రాజమహేంద్రవరంలో నిర్వహిస్తున్నామన్నారు. ఈ కుస్తీ పోటీలను దక్షిణాదిలో కూడా పరిచయం చేయాలనే ఆశయంతో ఆంధ్రప్రదేశ్‌లోని రాజమహేంద్రవరంలో తొలిసారిగా నిర్వహిస్తున్నామన్నారు. అండర్-15 బాలబాలికలకు, అండర్-20 పురుషులు, మహిళలకు రాష్ట్ర స్థాయిలో రెజ్లింగ్ పోటీలు ఏర్పాటు చేశామన్నారు. సుమారు 300 మంది రెజ్లర్స్ హాజరవుతారని చెప్పారు. ఈ పోటీల విజేతలు ఈ నెల 23న రాజస్థాన్‌లోని కోటాలో జరిగే జాతీయ స్థాయి కుస్తీ పోటీలకు అర్హత సాధిస్తారని తెలిపారు. క్లబ్ స్పోర్ట్స్ చైర్మన్ మద్దూరి శంకర్ మాట్లాడుతూ రెండు రోజుల పాటు ఈ రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీలు దివాన్‌చెరువు ఎస్వీబీసీ కల్యాణ మండపంలో జరుగుతాయన్నారు. రెజ్లర్లకు ఉచిత భోజన వసతి సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో క్లబ్ కార్యదర్శి ఉదయగిరి సురేష్, కోశాధికారి కామేశ్వరిదేవి, స్పోర్ట్స్ డైరెక్టర్ పి.హెచ్. ఎస్.కార్తీక్, సంయుక్త కార్యదర్శి వంశీ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితా విడుదల

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పాఠశాల విద్యాశాఖ పరిధిలో ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితా విడుదల అయింది. జిల్లా, మండల, మున్సిపల్, కార్పొరేషన్ ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితా విద్యాశాఖ వెబ్‌సైట్‌లో పొందుపరిచామని కాకినాడ జిల్లా విద్యాశాఖాధికారి పిల్లి రమేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయులకు ఈ జాబితాపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే తమ సీనియారిటీకి సంబంధించిన ధ్రువీకరణ పొందిన ఆధారాలతో ఈ నెల 11వ తేదీలోగా కాకినాడ జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

అవగాహన సదస్సుకు అనూహ్య స్పందన




సదస్సులో మాట్లాడుతున్న తిరుమల విద్యాసంస్థల చైర్మన్ తిరుమలరావు

తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు

రాజమహేంద్రవరం రూరల్: కాతేరులో తిరుమల విద్యాసంస్థల ప్రాంగణంలో గురువారం జరిగిన అవగాహన సదస్సుకు విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి అనూహ్య స్పందన లభించిందని తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు అన్నారు. ఈ సదస్సుకు 18 వేలమంది హాజరయ్యారని ఆయన తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను మానసికంగానే కాకుండా శారీరకంగా కూడా దృఢంగా ఉండేలా సన్నద్ధం చేయాలని, అప్పుడే వారు వృద్ధిలోకి వస్తారన్నారు. జాతీయస్థాయి పరీక్షలైన జేఈఈ (మెయిన్), జేఈఈ (అడ్వాన్స్‌డ్) అండ్ నీట్‌లలో తరచుగా విద్యార్థులు ఎదుర్కొనే సమస్యలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రస్తుత సమాజంలో పిల్లలు పుస్తకాలకన్నా ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్‌కి ఎక్కువగా అలవాటు పడ్డారని, మొబైల్‌తో ఎక్కువ సమయం గడిపితే జరిగే నష్టం గురించి తల్లిదండ్రులు వివరించాలని తెలిపారు. పిల్లలకు ఇచ్చే ఆస్తి కేవలం విద్య మాత్రమేనని, తల్లిదండ్రులు ఎంతో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో దేశవ్యాప్తంగా జరిగే ఇంజినీరింగ్ (జేఈఈ మెయిన్స్ అండ్ అడ్వాన్స్)పరీక్షలలో 25మంది పరీక్ష రాస్తే కేవలం ఒక్కరికి మాత్రమే సీటు దొరుకుతుందని అదే తిరుమలలో ప్రతి నలుగురిలో ఒకరికి సీటు లభిస్తోందని చెప్పారు. మెడికల్‌లో దేశవ్యాప్తంగా జరిగే నీట్ పరీక్షల ప్రకారం 16మంది పరీక్ష రాస్తే కేవలం ఒకరికి సీటు లభిస్తుందని, అదే తిరుమలలో ప్రతి ముగ్గురిలో ఒకరికి మెడికల్ సీటు వస్తుందన్నారు. తిరుమల విద్యాసంస్థల డైరెక్టర్ నున్న సరోజినిదేవి మాట్లాడుతూ పిల్లలకు తల్లిదండ్రులే మొదటి గురువులని వారిని చూసే ఎక్కువగా నేర్చుకుంటారని, కాబట్టి పిల్లల నడవడికను చిన్నప్పటి నుంచే తల్లిదండ్రులు తీర్చిదిద్దాలని అన్నారు. విజ్ఞానభారతి నేషనల్ సెక్రటరీ కొంపెల్ల సుబ్బరాయ శాస్త్రి మాట్లాడుతూ పిల్లలు పుస్తకాలను ఎక్కువగా చదవాలని అప్పుడే వారికి జ్ఞాన సముపార్జన లభిస్తుందని అన్నారు. అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్ బాబు, ప్రిన్సిపాల్ వి.శ్రీహరి పాల్గొన్నారు.

మీరు ఏదో మంచి చేస్తారని గెలిపించాం

- రాష్ట్రాన్ని ఉద్ధరిస్తారనుకున్నాం
- కేశనపల్లి సర్పంచ్ యెనుముల నాగు
- కార్పొరేషన్ లోన్లతో గ్రామాల్లో తలెత్తుకోలేని పరిస్థితి
- సీఎం, డిప్యూటీ సీఎంకు వీడియో సందేశం



యెనుముల నాగు

మలికిపురం: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లు ఏదో చేస్తారని.. రాష్ట్రాన్ని ఉద్ధరిస్తారనుకుని.. మీరు చేసినా చేయకపోయినా మీ వెనుక ఉండి పార్టీని గ్రామాల్లో అభివృద్ధి పథంలో నడిపే వాళ్లమని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జిల్లా కేశనపల్లి సర్పంచ్, మలికిపురం మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు యెనుముల వీర వెంకట సత్య నాగేంద్రప్రసాద్ (నాగు) అన్నారు. ఈ మేరకు కాపు, బీసీ కార్పొరేషన్ రుణాల సమస్యలను వివరిస్తూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లను ఉద్దేశిస్తూ గురువారం ఆయన సోషల్ మీడియాలో ఒక వీడియోను పోస్ట్ చేశారు. ప్రస్తుతం ఆ వీడియో హాట్ టాపిక్‌గా మారింది.

మలికిపురం మండలంలోని 21 గ్రామాల్లో కాపు కార్పొరేషన్‌కు రుణాల కోసం 1,060 మంది దరఖాస్తు చేస్తే 44 మందికి మాత్రమే ఇచ్చారని, ఇది చాలా అన్యాయమని ఆ వీడియోలో పేర్కొన్నారు. కేశనపల్లిలో కాపు కార్పొరేషన్ రుణాల కోసం 70 మంది దరఖాస్తు చేసుకుంటే ఇద్దరికి మాత్రమే ఇవ్వడం దారుణమన్నారు. 'కార్పొరేషన్ లోన్ల గురించి మీరు చెబుతున్నారు. మేమే చెప్పు దెబ్బలు తింటున్నాం' అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. గ్రామాల్లో కార్పొరేషన్ లోన్లు చాలా తక్కువగా ఇచ్చారనే బాధ ఉందని, రెండు కార్పొరేషన్ లోన్లు ఇచ్చిన మీరు 70 మందితో మమ్మల్ని తిట్టిస్తున్నారని దుయ్యబట్టారు. కార్పొరేషన్ లోన్ల విషయాన్ని చంద్రబాబు, పవన్ కల్యాణ్ పరిశీలించాలన్నారు. బీసీ కార్పొరేషన్ రుణాలకు 484 మంది దరఖాస్తులు పెట్టుకుంటే మండలంలో 65 మందికి ఇస్తామని చెబుతున్నారని, ఈ విషయాన్ని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌కు వివరిస్తే.. ఈ సమస్య తన పరిధిలో లేదని చెబుతున్నారన్నారు. 1994 నుంచి టీడీపీలో ఉన్నామని, గ్రామంలో పార్టీ నిర్వీర్యం కాకుండా కాపాడుకుంటూ వచ్చామని తెలిపారు. కార్పొరేషన్ రుణాల విషయంపై పునరాలోచన చేసి, సర్పంచ్‌లు తలెత్తుకుని తిరిగేలా చేయాలని కోరారు. కేశనపల్లిలో రెండు కాపు కార్పొరేషన్ రుణాలు, ఒక బీసీ కార్పొరేషన్ రుణం ఇస్తే మిగిలిన దరఖాస్తుదారులకు ఏం చెప్పాలో తెలియని పరిస్థితి నెలకొందని నాగు అన్నారు.

